"పాతాళభైరవి" సినిమా అయితే ఆ దంపతుల సహకారార్థం, లోక కళ్యాణార్థం "పాతాళభైరవి" తెప్పించి ఆడిస్తే – ఓ మనవడో, మనవరాలో పుట్టేదాకా వాళ్ళకా సరదా తీరుతుంది. ఇదీ ఓ పియా కా ఘర్ స్టోరీయేనా అంటున్నారా?

అవును. ఇదీ ఓ "పాతాళభైరవి" కథే; పాతకథే అంటారా? పాతకథలే బావుంటాయంటున్నారు కద!

# ఇల్లరికమ్స్

'ఇల్లరికంలో వున్న మజా, అది అనుభవించితే తెలియునులే' అని రమణారెడ్డిగారో ఎవరో పాడారు పూర్వం ఆ పేరిట వచ్చిన ఓ పాత సినిమాలో. నిజంగా ఇల్లరికంలో మజా వుందో, లేదో మనకైతే తెలీదుగాని 'సుఖం' మాత్రం హుళక్కి –

అత్తారింటికి తోవేదంటే – పప్పెట్టి, నెయ్యేసి, బువ్వెట్టి, చారోసి, అత్తారింటికి తోవేదంటే అని కితకితలు పెడతారు పిల్లల ఆటల్లో... అత్తారింటికెళ్ళే తోవ ఆడపిల్ల కంత సుఖవైందీ, ఈజీగా వుండేది కాదు.

...మోచేతి మీద దెబ్బలాటిదే కాపురం! కాని, మగాళ్ళకి అత్తారిల్లు మూడ్రోజులుంటే టెంపరరీ హెవెన్ – ఆ తర్వాత కాదు. సుగాత్రీ శాలీనుల కథ చూడండి. అందాకా ఎందుకు గుండమ్మ కథ తీస్కోండి. ఆడపిల్ల కాపరానికి అత్తవారింటికెళ్ళాలి. అల్లాగాక మగ పిల్లవాడే అత్తారింటికి వస్తే – కథ అడ్డంగా తిరుగుతుంది. తనతోపాటు తనవాళ్ళ స్టేటస్ కూడా తత్తుల్యంగా వుంటుంది. మగపిల్లల్లేక ఆస్తి వుండి ఆడపిల్లని వదులుకోలేనివాళ్లు, గారాబంగా పెరిగి పుట్టిల్లు వదల్లేని వాళ్ళు ఆస్తి, డబ్బు ఎరచూపి పిల్లడ్ని ఇంటికి తెచ్చుకుంటారు. అలాటి అల్లుళ్ళు అత్తారింట్లో 'సెకండ్ రేటు సిటిజన్సు' కింద మారిపోవాల్సి వస్తుంది. అత్తగారు రిచ్ యంగ్విడో అయితే అల్లుడికి మరో 'ఎక్స్ట్రా కాన్సిట్యూషనల్ అథారిటీ' పురుష రూపంలో సాక్షాత్కరిస్తుంది. పెళ్ళికూతురు తల్లి పక్షమే అయితే ఆ బాలాకుమారుడి పాట్లు గుర్రపెత్తులో పడ్డ 'రాజు–మంత్రి' పని అవుతుంది. ఆడపిల్లకు తల్లి దగ్గర గారాం అయితే కథ ఓలాగ, తండ్రి దగ్గర గారాం అయితే మరోలాగ, తండ్రి లేనిదయితే మరోలాగ, తల్లి లేనిదయితే వుంకోలాగ వుంటుంది. కిరాతార్జునీయం రాసిన 'భారవి' ఇల్లరికం వెళ్ళాడు. ఎందుకు వెళ్ళాడయ్యా అంటే వూరికే సరదాకు వెళ్ళలేదు. తన్ను గొప్ప కవి అని అంతా మెచ్చుకుంటూ వుంటే తండ్రి మాత్రం 'ఏదో కుర్ర కుంక' అన్నట్లు మెచ్చుకునేవాడు కాదుట. అందుకు కినిసి, తండ్రికి తన మీద జెలసీ అని కోపగించుకుని, తనను మెచ్చుకోకుండా తీసిపారేసే ఫాదర్ని ఖతం చేద్దామని ఓ రాత్రి అటకెక్కి కూర్చుని – రుబ్బురోలు పత్రం అన్నం తింటున్న లేదా

పవ్వళించియున్న తండ్రి మీద బుర్ర పగిలేలా రామకీర్తన పాడించాలనుకున్నాడు. (బుర్ర పగిలేలా అన్నారు బావుంది. మళ్ళీ రామకీర్తనేవిటి? అని అడక్కండి. బుర్ర రామకీర్తన పాడ్డం గురించి ఆచార్య తూమాటి దొణప్పగార్ని అడుగుదాం - ఎందుకంటే ఆయన రామ కీర్తన్లే కదా పాడేది). మరో డౌటు - రుబ్బురోలు పొత్రం ఎలా అటక మీదకు తీసుకెళ్ళాడండీ కొడుకు - అని అంటున్నారు. అడగండడగండి. చెప్పేవాడూ అదీ లోకువే కదా. తండ్రి మీద ద్వేషంతో తండ్రిని చంపితే తల్లి ముండమోస్తుందనైనా యింగిత జ్ఞానం లేకుండా (ఎన్టీఆర్‌కు కేంద్రం మీద కోపం వచ్చినట్లు) ఆ రుబ్బురోలు పొత్రాన్ని అటక మీదకు చేరవేశాడా నవయువకవి. అప్పుడు తల్లి నిజమైన తల్లిలా అడిగింది 'ఏవండీ మీరు వాణ్ణి మెచ్చుకోరే అని - వాడు బాధపడు తున్నాడు' అని. అప్పుడా తండ్రి 'ఓసి వెర్రిదానా- వాడి గొప్పతనం చూసి నేను అసూయపడ్డం లేదు. కొడుకుని తండ్రి పొగడకూడదు. వాడికి ఆయుక్షీణం - వాడు పది కాలాలు చిరంజీవై వుండాలి' అనగానే ఈ పసిడి పలుకుల్ని విన్న అటకమీది కవి 'నాన్నా నేనెంత తుచ్ఛుడ్ని, నీచుడ్ని' అని క్రిందకు దూకి రుబ్బురోల్ని అవతల పారేసి తండ్రి కాళ్ళట్టుకుని నాకు ప్రాయశ్చిత్తం చెప్పమని తండ్రిని ప్రాధేయపడ్డాట్ట. (ఇక్కడ మీకో అనవసరపు సిల్లీ డవుటు వస్తుంది. మన వెనకటి సిన్మా హీరోలు తమ కొడుకుల్ని పిల్లల్లేకపోయినా పిలక పట్టుకుని సినిమాల్లో కీడ్చుకొచ్చి హీరో వేషాలేయిస్తూ వాళ్ళని పొగుడ్తారు కదా. వారికి ఆయుక్షీణం కాదా అని. కాదు. ఎందుకంటే వాళ్ళు భారవిలా నిజమైన ప్రజ్ఞా వంతులు కారు గనుక - తండ్రులు పొగిడే వెర్రిమొర్రి పొగడ్తలు వారినేం చేయలేవు - అయే ఆయుక్షీణం మనకే అంటే ప్రేక్షకులికి) భారవిని తండ్రి అత్తారింట్లో ఓ ఏడాది కామోసు వుండమన్నాడ్ట. ఇదేమి శిక్ష-తంతే గారెల బుట్టలో పడ్డాననుకున్నాడు అల్లుడు. ఏముంది? అల్లుడు వచ్చాడనుకుని కవి గదా మొదటి కాసిన్ని రోజులు తెగ మర్యాదలు చేసిపారేశార్ట. ఆ పిమ్మట ఈ అల్లుడి ఘటం ఎంతకీ కదలకపోయేసరికి లా ఆఫ్ డిమినిషింగ్ రిటర్న్స్ ప్రకారం - అల్లుడ్నీ, అమ్మాయినీ కూడా నానా ట్రబుల్సూ పెట్టేసి 'ఇల్లరికంలో వున్న మజా' అంతా చూపించేసార్ట. ఇంకా చాలా పెద్ద కథ వుంది దీన్తర్వాత - కాని కవులు మాత్రం తమ కవిత్వాలు అత్తవారింట్లో మెచ్చుకున్నారు కదా అని అక్కడే తిష్టవేస్తే ఆబోరుదక్కదు. అంచాత ఆడది కాని, మగాడు కాని కష్టపడి పనిచేసి జీవించాలి కాని 'అదర్ పీపుల్సు మనీ అండ్ అవర్ బ్రెయిన్స్' అన్నట్లు బతకకూడదు. లేజీగా వుంటే రోజులు యాజీగా గడవ్వురా నాయినా అని కుర్రకారు గ్రహించాలి.

మానవ సంబంధాల్ని ఆర్థిక కారణాలు డామినేట్ చేస్తాయి. అంటే మానవ సంబంధాలన్నీ అచ్చం ఆర్థిక సంబంధాలే ఐనప్పుడు కారల్ మార్క్స్ అనే పెద్దాయన వీట్ని మనవాళ్ళు లాంఛనాల క్రింద, కట్నకానుకలు, ఆచారాలు, ఆనవాయితీల క్రింద మార్చేశారు.

ఈ మధ్యన చైనాలో 'ఇల్లరికం' మహాజోరుగా వుందని పేపర్లో చదివా - కమ్యూనిస్ట్ చైనాలో ఇల్లరికవా? మావో సూక్తులు, ఎర్ర పుస్తకం, సాంస్కృతిక విప్లవం యివన్నీ ఏమైనాయ్?

చైనాలో ఆడపిల్లలు ఎగబడి మగపిల్లల్ని పెళ్ళి చేసుకోర్ట. మగపిల్లలే ఆడపిల్లల్ని చేసుకుంటార్ట. కమ్యూనిస్ట్ చైనాలో మగాడికి పెళ్ళి కావడం చాలా కష్టం, బ్రహ్మప్రయత్నమట. కన్యాశుల్కం టూ మచ్చీ త్రీ మచ్చీన్ట. అంత వగలూ, సొమ్ములూ, లాంఛనాలూ, పెళ్ళి ఖర్చులూ పెట్టుకోలేని మగాళ్ళు పోతు తాడిచెట్లలా అలా వుండిపోతున్నార్ట. వాళ్ళ దగ్గర ఖర్చయేది శ్రమశక్తే కాని సృజనశక్తి అంతా వృథా పోతున్నదట.

అంచాత అన్ మారీడ్ యువకులు చైనాలో ఇల్లరికం ఛాన్స్‌కి చాతకపక్షులు వెన్నెల కోసం ఎగబడినట్లు ఎగబడుతున్నార్ట. అసలీ బ్యాడ్ షేపు చైనాకి ఎందుకు వచ్చిందిటంటే –

ఆడపిల్లల్ని పుట్టకుండానే, పుట్టగానే చంపేయడం ... గర్భస్రావాలూ యిత్యాది భ్రూణ హత్యలవల్ల రానురాను – మొగ వెధవలు అల్లా పెరిగిపోతూ ఆడసంతు దవునై దవునై రాను రాను భయంకరమైన షార్టేజి ఏర్పడిపోయిందిట పెళ్ళికూతుళ్ళకి. డిమాండ్ ఎక్కువ సప్లయి తక్కువ అయేసరికి గిరాకీ పెరిగిపోయి – డబ్బున్నవాళ్ళకే పెళ్ళిళ్ళు లేదా ఇల్లరికం పరిస్థితి వచ్చేసిందిట.

మనవాళ్ళు కూడా గర్భస్రావాలూ, భ్రూణ హత్యలకి వెనకాడరు ఆస్తుల కోసం, ఆడపిల్లల్ని కన్న తల్లులదే రాజ్యం అవుతుందని ధీమా –

మన దేశంలో కూడా ఆడపిల్లల సంఖ్య తగ్గి మగపిల్లల సంఖ్య పెరిగితే – టెక్స్‌టైల్ ఇండస్ట్రీ, కాస్మటిక్సు వగైరా వగైరాలన్నీ దెబ్బతిని – మగపిల్లలకు ఎంత ఎదురిచ్చినా పెళ్ళిళ్ళు కాని రోజు వస్తే – అప్పుడుగాని కథ అడ్డం తిరగదు.

అయితే చైనాలో కూడా ఓ మాటు పెళ్లయాక ద్విగుణీకృతోత్సాహం, కసితో వైఫ్ బీటింగ్ (పెళ్ళాల్ని చితకబాదకం) వుందిట. పెళ్ళాల్ని తన్నడం గురించి మరోమారు ముచ్చటించుకుందాం!

# ఫలశ్రుతి

రసాలా కోతకాయలా మీకేదిష్టం అంటే మీ రేం చెబుతారు? పప్పన్నం తిని పరవాణ్ణం తింటారా, పాయసం తాగి పప్పులను వేసుకుంటారా అని అడిగితే మీరేం చెప్పగల్రు? పేరంటానికి ఫారిన్ సిల్కుది కట్టుకుంటారా పోచంపాడుది కట్టుగుంటారా అని అడిగితే కూడా చెప్పడం మీకు కష్టమే. ఐస్‌క్రీమ్ తిని, కాఫీ తాగి వక్కపొడి వేసుగుంటారా, ఫ్రూట్ సాలెడ్ లాగించి బ్లాక్ టీ తాగి మిఠాయి కిళ్ళీ వేసుగుంటారా అని ప్రశ్నిస్తే మీరు మటుకు ఏం చెప్పగల్రు? హ్వావీ చెప్పలేరు. తింటేగాని బోధపడని రుచులు చెప్పగుంటే తీరతాయా? ముద్దు పెట్టుకోవడం గురించి వ్యాసం రాసి పెళ్ళానికి చూపించాడ్ట వో సుబ్బారావు. అప్పుడా ఇల్లాలు